


# ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌కు మహర్దశ

**-రూ.26.81 కోట్లతో అభివృద్ధి**

**- స్టేషన్ నుంచి 50 రైళ్ల రాకపోకలు**

**తార్నాక, జులై 24 ప్రభాతవార్త :** భారతీయ రైల్వే వ్యవస్థ ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందించాలనే దార్శనికతతో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను భారీ స్థాయిలో పునరాభివృద్ధి చేస్తోంది. ఈ పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లను సుమారు రూ.2,750 కోట్ల అంచనా వ్యయంతో ఆధునీకరిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోది 2023 ఆగస్టులో అదేవిదంగా 2024 ఫిబ్రవరిలో తెలంగాణలోని ఈ స్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపనలు చేశారు. ఇటీవల పలు స్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపనలు చేశారు. ఇటీవల బేగంపేట, వరంగల్, కరీంనగర్ స్టేషన్లను ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం చర్లపల్లి, సికింద్రాబాద్ సహా మరో ఆరు స్టేషన్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటిలో ఉప్పుగూడ రైల్వే స్టేషన్ కూడా ఒకటి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హైదరాబాద్ డివిజన్‌కు చెందిన ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద సుమారు రూ.26.81 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. హైదరాబాద్ నగర దక్షిణ భాగంలో ఫలక్‌నూమా కాచిగూడ సెక్షన్‌లో ఉన్న ఉప్పుగూడ ఒక సబర్బన్ గ్రేడ్3 స్టేషన్. ఈ స్టేషన్ దాని పరిసర ప్రాంతాలలోని వేలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తోంది. రోజుకు సగటున 5000 మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి ప్రయాణిస్తారు. ముఖ్యంగా హైటెక్ సిటీ, లింగం పల్లి వంటి నగర పశ్చిమ ప్రాంతాలకు ఉద్యో గం, వ్యాపారం నిమిత్తం వెళ్లేవారు సబర్బన్ రైళ్లను ఆశ్రయిస్తున్నారు. సబర్బన్ రైళ్లతో కలిపి ఈ స్టేషన్‌లో రోజుకు దాదాపు 50 రైళ్లు నిలుస్తాయి.

**అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన పనులు..**

ఉప్పుగూడ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా అనేక నూతన సౌకర్యాలు కల్పిస్తున్నారు. నూతన ముఖద్వారం ఏర్పాటు, రెండవ ప్రవేశ ద్వారం వద్ద స్టేషన్ భవన అభివృద్ధి, స్టేషన్ ఆవరణ ప్రాంత అభివృద్ధి, 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, రెండు ప్యాసింజర్ లిఫ్టులు, రెండు ఎస్కలేటర్ల ఏర్పాటు, ప్లాట్ఫామ్ ఉపరితలాన్ని మెరుగుపరచడం, ప్లాట్ఫామ్ పైకప్పులు అదనంగా ఏర్పాటు చేయడం, కాన్కోర్స్, వెయిటింగ్ హాళ్ల లోపలి పునరుద్ధరణలు, దివ్యాంగులకు అనుకూలమైన టాయిలెట్ల నిర్మాణం, నూతన సూచిక బోర్డులు, నూతన ఫర్నిచర్ ఏర్పాటు, మెరుగైన లైటింగ్, తాగునీటి సదుపాయాలు, ప్రయాణికుల సౌకర్యార్థం సిట్టింగ్ అరేంజ్ మెంట్స్ మార్పులు, పర్యావరణ అనుకూల చర్యలు, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు వంటివి కూడా పరిశీలిస్తున్నారు.

**పనుల పురోగతి, లక్ష్యం..**

ప్రస్తుతం స్టేషన్ నవీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వెయిటింగ్ హాల్ మెరుగుదలలు, 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి గిర్డర్ల ఏర్పాటు పనులు ఇప్పటికే పూర్తయ్యాయి పార్కింగ్ షెడ్ల కాంపౌండ్ వాల్ నిర్మాణం చివరి దశలో ఉంది. లిఫ్టు, ఎస్కలేటర్ల షీటింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. అన్ని పనులు ఏకకాలంలో జరుగుతున్నాయి. ఈ పునరాభివృద్ధి ప్రాజెక్టను డిసెంబర్ 2025 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉప్పుగూడ స్టేషన్ ఆధునీకరణ పూర్తయితే, ఈ ప్రాంతంలోని లక్షలాది మంది ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవం లభిస్తుంది.

హైదరాబాద్ వార్త



# ఐటీ రిటర్న్స్..సైబర్ మోసం

**- పన్నుదారులను టార్గెట్ చేస్తున్న కేటుగాళ్లు**

**- అప్రమత్తమంటున్న సైబర్ క్రైం ఎసిపి శివమారుతి**



**హైదరాబాద్,జూలై24, ప్రభాతవార్త:** సైబర్ నేరస్తులు ఎవరినీ వదలడం లేదు. అవకాశం దొరికితే వారిని అనుగుణంగా మాయ చేసి నేరాలు చేస్తున్నారు. కొంత పోకడలో నష్టపరిచి టెక్నాలజీ అంటే భయం కలిగిస్తున్నారు. తాజాగా ఐటీ రిటర్న్ పన్నుదారులకు ఫిషింగ్ మెయిల్స్‌ను పంపించి లూటీ చేస్తున్నారు. నగదు అంటే చిల్లు..టెక్నాలజీతో డిజిటల్ మోసం..డబ్బులను ఎలా భద్రతపరుచుకోవాలో అర్థం కాని పరిస్థితి. నిరంతరం కాపుకాచుకొని ఉండాల్సిన దుస్థితి. అప్రమత్తంగా ఉంటే ఎలాంటి సమస్యలు ఉండవని సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి సూచిస్తున్నారు. ఆశ, అత్యాశతోనే మోసాలు జరుగుతాయనేది గుర్తించుకోవాలని పేర్కొంటున్నారు.

**అపరిచిత మెయిల్స్‌తో అప్రమత్తం...**

గుర్తుతెలియని వ్యక్తులు పంపించిన ఎలాంటి మెయిల్ లింక్స్‌ను తెరవకూడదని అధికారులు సూచిస్తున్నారు. ఫోన్‌ద్వారా పంపినవారితో పున:పరిశీలించుకోవాలని చెబుతున్నారు. ఫోన్ ఎసెమ్మెస్, ఈమెయిల్, వాట్సాప్ లింక్‌లు సైబర్ క్రిమినల్ పనే అని గుర్తించుకోవాలి. అంతేకాకుండా బహుమతులు, డిస్కౌంట్ వోచర్స్ తదితర రకంగా వచ్చిన స్పందించొద్దు. ఇవన్నీ ఫేక్ అని తిప్పికొట్టాలి. డిస్కౌంట్‌లు ఉచితంగా ఇవ్వరని, స్కీంలు సైతం ఉండవని తెలుసుకోవాలి. ముఖ్యంగా ఇన్‌కంట్యాక్స్ రీఫండ్ కోసం లింక్‌లతో కూడిన మెయిల్స్‌ను అధికారులు ఎట్టి పరిస్థితుల్లో పంపించరని గుర్తుంచుకోవాలన్నారు. ఐటీ రిటర్న్ కోసం పిన్ నెంబర్, పాస్‌వర్డ్ తదితర వివరాలు అవసరం ఉండదని ఐటీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఆదాయపన్ను చెల్లించేవారిని సమాచారాన్ని సేకరించి ఏజంట్లుగా వ్యవహరించి వారికి ఆదాయపన్ను రీఫండ్ చేసుకోవాలంటూ మెయిల్స్‌ను పంపించాడాన్ని నమ్మకూడదు. మీ ఆదాయపన్ను చెల్లించిన జరిగిన తర్వాత మీకు కొంత మొత్తం రీఫండ్ అయిందని, ఈ డబ్బు మీ ఖాతాలో జమ కావాలంటే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని ఇటీవల లింక్‌లతో కూడిన మెయిల్స్‌ను తరచుగా వెలుగు చూస్తున్నారు. ఇలాంటి ఫిషింగ్ మెయిల్స్, లింక్‌ల ద్వారా మాల్‌వేర్‌ను జొప్పించిన సైబర్ నేరగాళ్లు ఆ తర్వాత ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.

**యూఆర్ఎల్ లింక్‌లను కాపీ పేస్ట్ చేయవద్దు : శివమారుతీ, ఏసీపీ సైబర్‌క్రైం**

ఐటీ రిటర్న్ పేరుతో సైబర్ నేరగాళ్లు పంపే యూఆర్ఎల్ లింక్‌లను కాపీ పేస్ట్ చేయకూడదు. ఇతరులకు పంపవద్దు. ఫోన్, కంప్యూటర్‌ను ఎప్పటికప్పుడు యాంటీ వైరస్‌తో స్కాన్ చేయాలి. ఐటీ చెల్లింపులు, రిటర్న్‌లు అధీకృత వెబ్‌సైట్ ద్వారానే చేయాలి. తరచూ పాస్‌వర్డ్‌లు మార్చాలి. బ్యాంకు ఖాతాలకు టూ స్టెప్ వెరిఫికేషన్‌ను ఎనేబుల్ చేసుకోవాలి. తరచూ ఇలాంటి మెయిల్స్ వస్తుంటే వెంటనే సైబర్ క్రైం అధికారులకు సమాచారమందించాలని సైబర్‌క్రైం ఏసీపీ శివమారుతీ సూచిస్తున్నారు.

# రోజంతా వర్షం..

**-నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన -పలుప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన నీరు..ట్రాఫిక్‌కు అంతరాయం -నిండు కుండలా మారిన హుస్సేన్‌సాగర్ -ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు**





**హైదరాబాద్,జూలై 24,ప్రభాతవార్త:** నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. గురువారం ఉదయం నుంచి మబ్బులతో చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. మధ్యాహ్నం నుంచి చిరు జల్లులు కాస్త భారీవానగా మారింది. సుమారు 2 గంటల పాటు ఏకదాటిగా కురిసిన వానతో నగర వాసులు తడిసి ముద్దయ్యారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్‌నగర్, నారాయణ గూడ, లక్డీకాపుల్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, మాదాపూర్, అమీర్ పేట, గచ్చిబౌలి, దిల్‌సుఖ్ నగర్, హయత్ నగర్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. అలాగే సాయంత్రం ఆఫీసులు, కాలేజీలు, పాఠశాలలు విడిచిపెట్టే సమయం కావడంతో వాహనాలు కిక్కిరిసిపోయాయి. చాలాచోట్ల పాదచారులు కూడా సాఫీగా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఐటీ కంపెనీలు అధికంగా ఉండే మాదాపూర్ టీహబ్, నాలెడ్జ్ సిటీ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. హైటెక్ సిటీ ఫ్లైఓవర్‌పై వాహనాలు నిలిచిపోయాయి. ఫ్లైఓవర్‌పై ఒక వాహనం బ్రేక్ డౌన్ కావడంతో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ఎడతెరిపి లేని వర్షం కారణంగా మియాపూర్‌లో ట్రాఫిక్ నిలిచిపోయింది. మియాపూర్ ఆల్విన్ కాలనీ నుంచి బొల్లారం చౌరస్తా వరకు వాహనాలు నిలిచిపోయాయి. సుమారు కిలోమీటర్ మేర వాహనాలు ఎటూ కదలలేని పరిస్థితి ఏర్పడి వాహనదారుల సహనానికి పరీక్ష పెట్టింది.అలాగే హైడ్రా, జీహెచ్ ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు ప్రతీ కూడలి వద్ద నీరు నిలవకుండా నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉన్నారు. వర్షం ఆగకుండా కురుస్తుండటంతో వారి ప్రయత్నాలు కూడా ఫలించ లేదు.

**హుస్సేన్ సాగర్‌కు జలకళ..** భారీవర్షాల పుణ్యమా హుస్సేన్‌సాగర్‌లోకి భారీగా వరదనీరు చేరుతోంది. గత 2 రోజులుగా సాగర్‌లోకి ఇన్ ఫ్లో ఎక్కువైంది. ఇవాళ జలాశయంలో నీటిమట్టం 513 అడుగులకు చేరింది. మధ్యాహ్నం 1728 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా 774 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. హుస్సేన్ సాగర్ నుంచి నీటి విడుదల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల వాసులను అధికారులు అప్రమత్తం చేశారు. శుక్రవారం కూడా వర్షం ఇలాగే కురిస్తే ఎగువ నుంచి ఇన్ ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అందుకు తగ్గట్లుగా ఔట్ ఫ్లో పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. మరోవైపు బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. ఈ కారణంగా రాష్ట్రంలో ఇవాళ, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని సూచించింది. హైదరాబాద్‌లో రేపు కూడా ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# సాధారణ ప్రసవాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

**-ప్రత్యేక క్యాంపులు చేపట్టి గర్భిణీలకు అవగాహన కల్పించాలి**

**-వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశం**



కింగ్‌కోఠి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్,జూలై 24,ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాల సంఖ్య ఎక్కువగా పెరగాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వైద్య అధికారులను ఆదేశించారు. గురువారం కింగ్ కోటి ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, జిల్లాలో వర్షాలు అధికంగా కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వచ్చిన ప్రతి రోగికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ సేవలు తప్పక అందాలని, ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సులు అలాగే ఇతర సిబ్బంది వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గైనిక్, వ్యాయమ గదులను పరిశీలించి గర్భవతులకు టీకాల తో పాటు, తీసుకోవలసిన పౌష్టికాహారం అలాగే వ్యాయామం చేయించాలని, మెటర్నటీ క్యాంపులు చేపట్టి గర్భవతులకు ఆహార నియమాలు, వ్యాయామంపై సంబంధించిన డాక్టర్లతో అవగాహన కల్పించాలని సూచించారు. కింగ్ కోటి ప్రభుత్వాసుపత్రిలో నెలలో ప్రసవాల సంఖ్య దాదాపు 200 వరకు ఉండటంతో వైద్యాధికారులను ఈసందర్భంగా అభినందించారు. అనంతరం ఎమర్జెన్సీ వార్డును సందర్శించి సమయానికి మందులు, భోజనం అందుతున్నాయా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు అందించాలని అలాగే ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచటంతో పాటు పరిసర ప్రాంతాలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా మెడికల్ వార్డ్‌ను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం, మహావీర్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డయాలసిస్ సెంటర్ ను సందర్శించి ఆరోగ్యశ్రీ ద్వారా 218 మంది, అలాగే ఈ హెచ్ఎస్ ద్వారా 6 మందికి అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి కృత్రిమ కాళ్లు చేతులు తయారు చేసే జైపూర్ బ్రాంచ్ సందర్శించి కృత్రిమ పరికరాల కొరకై వచ్చిన వారితో మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు కలెక్టర్ కు వివరిస్తూ తెలంగాణ తోపాటు ఆంధ్రాలో నుండి వచ్చిన వారికి కూడా ఉచితంగా కృత్రిమ పరికరాలను అందిస్తున్నామని తెలిపారు. అంతకుముందు ఎమర్జెన్సీ క్యాజువాలిటీ, ఆర్థో, ప్రసూతి గది, ఏఎంసీ గది, డెంటల్, ఇఎన్టి, చర్మవ్యాధులు, ఫిజియోథెరపీ, కంటి పరీక్షల గదులను కలెక్టర్ సంబంధిత డాక్టర్లతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సంతోష్ బాబు, డిసిహెచ్ఎస్ డాక్టర్ సూర్య శ్రీ, ఆర్డీవో రామకృష్ణ, తాసిల్దార్ నయీముద్దీన్, మహావీర్ డయాలసిస్ కేంద్రం నిర్వాహకులు ఇందర్ జైన్, సభ్యులు, వివిధ విభాగాల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యాస్ నగర్‌లో సీసీ కెమెరాలకు చిక్కిన చిరుత



**నార్సింగి, జూలై 24 ప్రభాతవార్త :** మూడు రోజుల క్రితం గండిపేట మండలం మంచిరేవుల వ్యాస్ నగర్ ప్రాంతంలో చిరుత కనిపించిందని స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి చిరుత కదలికలను కనిపెట్టేందుకు వ్యాస్ నగర్ ప్రాంతంలో ఏడు ప్రాంతాలలో సీసీ కెమెరాలు, ఎరలను ఏర్పాటు చేశారు. ఇళ్ల నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడిపోతున్నారు. స్థానిక ప్రజలు ఎక్కడ చిరుత వచ్చి తమపై దాడి చేస్తుందోనని నిత్యం హడలిపోతున్నారు. ఎట్టకేలకు అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చిరుత సంచారంను రికార్డు చేశాయి. దీంతో ఇక్కడ చిరుత సంచరిస్తున్న మాట వస్తావమేనని, స్థానికులు మరింత అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చిరుత ఏ ప్రాంతంలో సంచరిస్తుందో గుర్తించామని, త్వరలోనే దాన్ని ఎరల ద్వారా పట్టుకొంటామని అధికారులు తెలిపారు. ఈ నెల 21.వ,తేదీన మార్నింగ్ వాకర్లకు చిరుత సంచారం కనిపించింది. వాళ్లు నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు అటవీ శాఖ అధికారులను రంగంలోకి దింపారు. అటవీ శాఖ అధికారులు మూడు రోజుల తరువాత చిరుత సంచారం నిజమేనని సీసీ పుటేజిలను బయటపెట్టారు. వ్యాస్ నగర్‌ను ఆనుకొని మృగవని పార్కు ఉందని, దానిలో పెద్ద సంఖ్యలో జింకలు, కుందేళ్లు, దుప్పిలు ఉంటాయని, వాటిని తినేందుకు ఈ చిరుత వచ్చి ఉంటుందని అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## జువెనైల్ హోం నుండి ఐదుగురు బాలురు పరారీ

**సైదాబాద్, జూలై 24 ప్రభాతవార్త :** సైదాబాద్‌లోని జువెనైల్ హోం నుండి అయిదుగురు బాలురు సిబ్బంది కళ్లగప్పి పరారయ్యారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్‌లోని జువెనైల్ హోం (బాలుర పరిశీలక గృహం)లో ఉంటున్న అయిదుగురు బాలురు మంగళవారం రాత్రి సిబ్బంది ఎవరు గమనించకుండా గోడ దూకి పరారయ్యారు. బాలురు పరారైన విషయంపై హోం సిబ్బంది సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకుని పరారైన బాలురను వెతికే పనిలో నిమగ్నమయ్యారు. కాగా పరారైన బాలురిలో ఇద్దరు మిర్యాలగూడ, ఒకరు రంగారెడ్డి జిల్లా, ఒకరు ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంతానికి చెందిన వారిగా తెలుస్తుంది.

## విద్యుత్ సరఫరాపై సిఎండీ ముషారఫ్ క్షేత్రస్థాయి పర్యటన



బంజారాహిల్స్ బస్తీ ప్రాంతాల్లో పర్యటిస్తున్న సిఎండీ ముషారఫ్ ఫరూఖీ, డైరెక్టర్ నర్సిహులు తదితరులు

**హైదరాబాద్,జూలై 24,ప్రభాతవార్త:** గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీగా శాఖ నేపథ్యంలో విద్యుత్ సరఫరాను తెలుసుకునేందుకు టిజిఎస్పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈసందర్భంగా బంజారాహిల్స్,జూబ్లీహిల్స్, ఖైతరాబాద్ ప్రాంతాల్లోని పలుబస్తీల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. అలాగే కొత్తసబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థలపరిశీలన చేశారు. ఈకార్యక్రమంలో సిఎండీ వెంట నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, ఆపరేషన్ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ సాయిబాబా, హైదరాబాద్ సెంట్రల్ ఎస్ఈ వెంకన్న, మెహిదీపట్నం డిఈ సుధీర్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

**-హైడ్రా-జిహెచ్‌ఎంసి పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం**

**-ఇరుశాఖల కమిషనర్లు రంగనాథ్, ఆర్.వి.కర్ణన్**




సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

**హైదరాబాద్, జులై 24,ప్రభాతవార్త:** హైడ్రా జీహెచ్ఎంసీ పరస్పర సహకారంతో పని చేస్తే వర్షాకాలం ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడగలమని హైడ్రా, జీహెచ్ఎంసీ కమిషనర్లు ఏవీ రంగనాథ్, ఆర్.వి కర్ణ అభిప్రాయపడ్డారు. వర్షాకాలం క్షేత్ర స్థాయిలో ఎదురౌతున్న సమస్యలు.. వాటి పరిష్కారంలో ఇబ్బందులపై గురువారం జీహెచ్ ఎంసీ కార్యాలయంలో సమావేశమై చర్చించారు. ఈసమావేశంలో ఇరు శాఖల అధికారులు పాల్గొన్నారు. నాలా నెట్‌వర్క్‌పైన క్షుణ్ణమైన అవగాహన ఉన్న జీహెచ్ఎంసీ ఏఈలు, డీఈలు.. ఫీల్డ్‌మీద పనిచేస్తున్న హైడ్రా మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్(ఎంఈటీ)లు, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు(డీఆర్ ఎఫ్) బృందాలకు సహకారం అందించాలని ఇరువురు కమిషనర్లు సూచించారు. హైడ్రా జీహెచ్ ఎంసీ వేర్వేరు కాదని.. రెండు విభాగాల లక్ష్యం ప్రజలకు ఇబ్బంది లేని మెరుగైన జీవనాన్ని అందించడమే అనేది గ్రహించాలని ఇరు శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వర్షం పడినప్పుడు రహదారులను, నివాస ప్రాంతాలను వరద ముంచెత్తకుండా.. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇరు శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. జలమండలి సహకారం కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**పనుల పర్యవేక్షణలో పరస్పర సహకారం..**

ఆర్‌యూబీల వద్ద డీ వాటరింగ్ పంపుల నిర్వహణ, క్యాచ్‌పిట్స్ క్లీనింగ్, క్యాచ్‌పిట్స్ మధ్యన ఉన్న పైపులలో సిల్ట్ తొలగించడం, నా లా భద్రత, నాలాల క్లీనింగ్, సిల్ట్‌ను తరలించడం, మాన్సూన్ సమయంలో డీసిల్టింగ్ చేయడం, వర్షంలో కొట్టుకొచ్చిన చెత్తను తరలించడం, నాలాల్లో తీసిన సిల్ట్‌ను ఎక్కడకు తరలించాలి వార్డు కార్యాలయంలో ఎంఈటీలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. జీహెచ్ ఎంసీ జేసీ, డీసీ స్థాయి నుంచి డీఈలు, ఏఈలు ఇలా అన్ని స్థాయిల్లోనూ పూర్తి సహకారం హైడ్రాకు అందజేయాలని ఇరువురు కమిషనర్లు నిర్ణయించారు. జీహెచ్ ఎంసీ పరిధిలో 141 వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ఇరు శాఖలపై ఉందన్నారు. రోడ్డు అండర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌ల వద్ద నీరు నిలవకుండా చూడాలని నిర్ణయించారు.

## జన హృదయనేత కెటిఆర్‌కు శుభాకాంక్షలు

### -కెటిఆర్‌ను కలిసి బొకే అందజేసిన కార్పొరేటర్ అర్చన జయప్రకాష్



**అత్తాపూర్ జూలై24,ప్రభాతవార్త :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ,మాజీ ఐటి శాఖ మంత్రి కెటిఆర్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం ఆయన నివాసంలో రాజేంద్రనగర్ కార్పొరేటర్ పొడవు అర్చన జయప్రకాష్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....నవతరం నాయకుడు ,ప్రజల మనసులు గెలుచుకున్న జన హృదయనేత కెటిఆర్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగిందని భవిష్యత్తులో ఆయన నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని,దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని సిఎంగా కెటిఆర్ అవ్వడం పక్కా అన్ని దీమా వ్యక్తం చేశారు.

### బోనాలు ఉత్సవాలు ప్రతి ఒక్కరిలో సుఖశాంతులు వెల్లివిరియాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, రేషం మల్లేష్ తదితరులు

**చిక్కడపల్లి, జూలై 24 ప్రభాతవార్త:** బోనాలు ఉత్సవాలు ప్రతి ఒక్కరిలో సుఖశాంతులు వెల్లివిరియాలని భారతజాగృతి అధినేత్రి, శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం సాయంత్రం రామ్‌నగర్‌లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రేషం మల్లేష్ ఆధ్వర్యంలో ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమం స్థానిక మేదర్ బస్తి నుండి జెమిని కాలనీ అమ్మవారి దేవాలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్వకుంట్ల కవిత, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రామ్‌నగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రకాల వేషధారణలతో ఏర్పాటు చేసిన పోతరాజుల వీరంగాలతో కార్యక్రమం అందరిని ఆకర్షించింది. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేత ఎం.ఎన్.శ్రీనివాసరావు, బిఆర్ఎస్ యువనేత ముఠా జైసింహా, నేతలు కల్వ గోపి, నేత శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, రమేష్ , మధు, అజయ్ , జోగేందర్, రజనీకాంత్, మనోజ్ ,డేవిడ్, రింకు సింగ్, సత్యనారాయణ, వెంకటేష్, అమిత్ బన్నీ ,అరుణ్, ఆయాజ్ , సోను. పాల్గొన్నారు.

### సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే ముఠాగోపాల్



పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి,జూలై 24 ప్రభాతవార్త:** సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరఉ భాగస్వాములు కావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్‌లోని విద్యానగర్ స్వామి వివేకానంద పాఠశాలలో పిల్లలకు నోటుపుస్తకాల పంపిణీ కార్యక్రమం బిఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి తోచిన విధంగా సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, బిఆర్ఎస్ నాయకులు అనురాధ, ప్రియాంక, విక్కి, అబ్బు, యూనిస్, సత్యనారాయణ, ధర్మ, శ్రీనివాస్, రాజు, పతి, సత్యవేణి, నాగశ్రీ, మైమూద్ పాల్గొన్నారు.

### తడి,పొడి చెత్తను వేరు చేసి ఆటోల్లో వేయాలి

**- బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర**



బండ్లగూడ కార్పోరేషన్ అభ్యుదయ నగర్ కాలనీలో తడి,పొడి చెత్తలపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న కమీషనర్ శరత్‌చంద్ర

**నార్సింగి, జూలై 24 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ ప్రజలంతా తడి,పొడి చెత్తను ఇళ్లల్లోనే వేరు చేసి ఆటోల్లో వేయాలని కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. 100.రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం కార్పొరేషన్ పరిధిలోని 19.వ,డివిజన్ అభ్యుదయ నగర్ కాలనీలో స్థానికులకు తడి,పొడి చెత్తలను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. తడిపొడి చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నామని, పొడి చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు పంపిస్తున్నామన్నారు. ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, చెత్త, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. చెత్త నిలువ ఉంటే దోమలు, ఈగలు వృద్ధి చెంది విషజ్వరాలను వ్యాప్తి చేస్తాయన్నారు. కార్పోరేషన్ తరపున శానిటేషన్ విభాగాన్ని అప్రమత్తం చేశామన్నారు. వరద నీరు ఎక్కడైనా రోడ్లపై నిలిచి ఉంటే మా దృష్టికి తీసుకు రావాలని, వెంటనే పరిష్కరిస్తామన్నారు. కాళీమందిర్ జంక్షన్‌లో పబ్లిక్ టాయిలెట్స్ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఇ యాదయ్య, ఏఈఈ రాజ్ కుమార్, ఎస్.ఐజి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నార్సింగి మున్సిపల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తడి,పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది దృశ్యం.

## వలస కార్మికుల కోసం సమగ్రమైన చట్టం రూపకల్పనకు చర్యలు : మంత్రి వివేక్



కార్మిక శాఖ మంత్రిని కలిసిన బిఎంఎస్ రాష్ట్ర నేతలు

**చిక్కడపల్లి,జూలై 24 ప్రభాతవార్త:** వలస కార్మికుల విషయంపై సమగ్రమైన చట్టం విషయంపైన తప్పకుండా ప్రభుత్వం చర్యలను తీసుకుంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. గురువారం బి ఎం ఎస్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆల్ ఇండియా ప్రభారి కే.వి. రాధాకృష్ణన్, టీఎస్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డాక్టర్ కె రంగారావు , ఆర్ సి ఐ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు చంద్రమోహన్ గారు, కోటేశ్వరరావు తదితరులు రాష్ట్ర మంత్రి వివేక్ ను కలిసి సిగాచి ఫార్మలో జరిగిన సజీవ దహనం లో మరణించిన కార్మికులకు నష్టపరిహాంలో కాలయాపన జరుగుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్తులో మైగ్రేట్ కార్మికులకు నష్టపరిహార విషయంలో ఒక స్థిరమైన చట్టపరమైన విధానాన్ని ఏర్పాటు చేయాలని నేతలు కోరారు. వెంకటనే స్పందించిన మంత్రి తాను సంగారెడ్డి కలెక్టర్తో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాను, నష్టపరిహార విషయాలన్నీ కూడా తెలుసుకుంటున్నాని వివరించారు. అదేవిధంగా ట్రిపుల్ ఐటీ బాసరలో జరుగుతున్న కనీస వేతనాలు ఇవ్వకుండా 25 మహిళా కార్మికులను కనీస వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడికి గురి చేస్తున్నచేస్తున్నారని., కాలయాపనకు గురవుతున్న కనీస వేతనాల షెడ్యూల్డ్ మినిమం వేజ్ విషయం పైన కూడా వారితో చర్చించడం జరిగినది. యజమాన్యం కార్మిక సంఘాలు పెట్టిన డిమాండ్లో విషయంపై ఒప్పుకోవడానికి సిద్ధం కావడం లేదనే విషయాన్నీ మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా త్వరలో కనీస వేతనాల షెడ్యూల్ అన్నిటిని కూడా జీవో రూపేనా తప్పకుండా రిలీజ్ చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## బిసిల సంక్షేమం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రాగం : సాయిబాబా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

**ముషీరాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** బలహీన వర్గాల సంక్షేమం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రాగాన్ని ఎత్తుకుందని టిడిపి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజవర్గం అధ్యక్షుడు సాయిబాబా విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నప్పటికి కొత్తగా బలహీన వర్గాల సంక్షేమం గుర్తుకు వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలోకి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను తీసుకువచ్చి ఏధీమాతో అనేక హామీలు ఇప్పించారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఇటీవల నియమించిన సమాచార కమిషన్ సభ్యులు 4 గురు అగ్రవర్ణాలకు చెందినవారేనని, ఇదెక్కడ న్యాయమన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాయిబాబా మట్లాడుతూ 20 నెలలుగా లక్షలాది మంది బిసి విద్యార్థులు ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ఎదురుచూస్తున్నారని, ఇవన్ని మరిచిన సిఎం రేవంత్‌రెడ్డి బిసిల రిజర్వేషన్‌ల విషయంలో పిఎం మేడలు వంచుతామని ప్రగల్భాలు పలుకుతున్నారని, ముందుగా గతంలో సిఎం ఇచ్చిన హామలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బిసిలకు వ్యతిరేకమని ప్రాధాన్యత లేని పదవులు బిసిలకు ఇచ్చి, అత యంత ప్రాధాన్యత కలిగిన పదవులను అగ్రవర్ణాలకు కట్టబెడుతూ బిసిలకు బూటకపు వాగ్దానాలు చేయడం అలవాటేనని ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పుట్టినప్పటి నుంచి అగ్రవర్ణాలవారికే పెత్తనం ఇచ్చింది, కాని బలహీన వర్గాల గురించి ఏనాడు ఆలోచించలేదన్నారు. రాష్ట్రంలోఉన్న 16 వేల మంది హోం గార్డులకు 24వ తారిఖు వచ్చినప్పటికి వేతనాలు ఇంకా అందలేదన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నల్లెల కిషోర్, బాలరాజగౌడ్, ఎస్.ప్రకాష్, అనిల్‌కురుమ తదితరులు పాల్గొన్నారు.

## కిషన్‌బాగ్‌లో కంచెలేని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లతో ఇబ్బందులు



కిషన్‌బాగ్‌లోని నజంనగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద కంచె లేని దృశ్యం

**చార్మినార్,జూలై 24 ప్రభాతవార్త :** బహదూర్‌పుర నియోజకవర్గం,కిషన్‌బాగ్ డివిజన్ పరిధిలోని నజంనగర్ లో ఉన్న విద్యుద్ ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ కంచెలు లేకపోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయ పడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెలు లేనందున గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రక్క నుంచి నడిచి వెళ్లాలంటనే సందేహిస్తున్నారు.ప్రతీ రోజు పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు నజంనగర్‌కు వస్తుంటారు. రహదారుల ప్రక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. కంచె లేని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల ప్రక్క నుంచి వాహనాలు నడిపే సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.ఈ సమస్యను పరిష్కరించాలని పలు మార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నప్పటికి ఎటువంటి ఫలితం లేక పోయిందని నజంనగర్ వాసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాత్రి వేళల్లో చీకటిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్క నుంచి నడిచి వెళ్తున్న వృద్దులు,మహిళలు తీవ్ర ఇబ్బందుల పాలవుతు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నజంనగర్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ కంచెటు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ప్రతి ఇంటికి నెంబర్ ప్లేట్ల ఏర్పాటు

**యూసుఫ్‌గూడ, జూలై 24, ప్రభాతవార్త :** కాలనీలలో గాని, బస్తీలో గాని ఇంటిని గుర్తించాలంటే ఆ ఇంటికి చిరునామా స్పష్టంగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందని మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎస్వీ ప్రసాద్ అన్నారు. ఇందుకుగాను మోతీనగర్ హౌసింగ్ సొసైటీ ప్రాంతంలో నిర్మించుకున్న ప్రతి ఇంటికి ఇంటి నెంబర్‌తో సహ పూర్తి చిరునామాను నెంబర్ ప్లేట్ల ద్వారా లేఅవుట్లోని ప్రతి ప్లాటు, ఇంటికి బిగించటం జరుగుతుందని ప్రతిఒక్క ఇంటి యజమాని సొసైటీ ద్వారా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్

**యూసుఫ్‌గూడ, జూలై 24, ప్రభాతవార్త :** అసాంఘిక శక్తులను అరికట్టే దిశగా పోలీస్‌శాఖ కార్డన్ సెర్చ్ నిర్వహించటం జరుగుతుందని వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ టి.గోవర్ధన్ అన్నారు. ఇందుకు గాను వెస్ట్ జోన్ పరిధిలోని బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో నగర సీపీ ఆదేశాల మేరకు డీసీపీ ఆధ్వర్యంలో సంజయ్‌నగర్, శ్రీరామ్‌నగర్ లో బుధవారం రాత్రి కార్డన్ సెర్చ్ జరిగింది. దాదాపు 220 ఇళ్లల్లో సెర్చ్ చేయగా ఇందులో సరియైన పత్రాలు లేనివి 29 ద్విచక్ర వాహనాలు, 3 త్రీవీలర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 9 మంది రౌడీషీటర్లను, ఏడుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజల సౌకర్యంకోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ప్రజల సహకారం ఎంతైన ఉంటుందని మీరు నివసించే ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సేఫ్టీ, సెక్యూరిటీ దృష్టిలో ఉంచుకుని కార్డన్ సెర్చ్ నిర్వహించటం జరిగిందని పేర్కొన్నారు. ఇందులో ఎస్ఆర్‌నగర్ ఏసీపీ రాఘవేందర్‌రావు, బోరబండ సీఐ సురేందర్, డీఐ సైదులుతో పాటు వారి సిబ్బంది పాల్గొన్నారు.

### దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

**సైదాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కాంచన్‌బాగ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎసిపి ఎ.సుధాకర్, కాంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్‌లు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మూసారాంబాగ్ ప్రశాంత్‌నగర్‌లో నివాసముండే మహ్మద్ ఆరిఫ్(26) ఈ నెల 8వ తేదీన రాత్రి 10 గంటల ప్రాంతంలో తన యమహా ద్విచక్ర వాహనాన్ని డిఎంఆర్ఎల్ చౌరస్తాలోని పోచమ్మ దేవాలయం వద్ద పార్క్ చేసి ఎఫ్ఎస్ డీజిల్ సర్వీసెస్‌లో పనిచేయడానికి వెళ్లాడు. అనంతరం 9వ తేదీ ఉదయం 9 గంటల ప్రాంతంలో తిరిగి వచ్చి చూడగా యమహా వాహనం కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ లాభం లేకపోవడంతో కాంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో కాలాపత్తర్‌కు చెందిన ఫిరోజ్ ఖాన్(22) యమహాను దొంగిలించినట్లుగా తేలింది. నిందితుడిని అరెస్టు చేసి యమహా, యాక్టీవా వాహనాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఫిరోజ్‌ఖాన్‌పై కాంచన్‌బాగ్, సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్లలో గతంలో కూడా కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు ఫిరోజ్‌ఖాన్ మద్యానికి, గంజాయికి బానిసగా మారి డబ్బుల కోసం ద్విచక్రవాహనాల దొంగతానికి పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

### డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు



జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో సమావేశమైన కార్పొరేటర్ కొంతం

**అడ్డగుట్ట,జూలై 24 ప్రభాతవార్త:** మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్ టీచర్స్ కాలనీ, వెస్ట్ మారేడ్‌పల్లి రెజిమెంటల్ బజార్ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య అస్తవ్యస్థంగా ఉందని, వాటి పరిష్కారానికి శాశ్వత మరమ్మత్తు చేపట్టాలని కార్పొరేటర్ కొంతం దీపిక జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లో నెలకొన్న సమస యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఇంజనీర్లు అమరేందర్‌రెడ్డి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి : ఎమ్మెల్సీబొగ్గారపు



5వ వార్డు వాసవి కాలనీలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌ను సన్మానిస్తున్న వాసవి కాలనీ ప్రతినిధులు చొల్లేటి రమేశ్

**కంటోన్మెంట్,జూలై 24 ప్రభాతవార్త:** సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ సూచించారు. అమావాస్యను పురస్కరించుకొని కంటోన్మెంట్ 5వ వార్డు వాసవి కాలనీలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ బొగ్గారపు ప్రారంభించారు. ఈ సందర్భంగా మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్, వాసవి కాలనీ ప్రతినిధులు చొల్లేటి రమేశ్, సిహెచ్.ప్రియంవదలు పాల్గొని ఎమ్మెల్సీ బొగ్గారపుకు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.



హిమాయత్ నగర్ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా జరిగిన అన్నదానం కార్యక్రమంలో హిమాయత్ నగర్ ఆర్య వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్న దృశ్యం

# నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేలా కృషి..

### హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి



ప్రసంగిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, చిత్రంలో కార్మిక శాఖ అధికారులు సునీత, జాసన్ తదితరులు

**చిక్కడపల్లి, జూలై 24 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో తెలంగాణ గేట్ వే ఫర్ అడాప్టింగ్ అండ్ ట్రైనింగ్ ఎంప్లాయిమెంట్ (టిగేట్) ఏర్పాటు చేసి పరిశ్రమల భాగస్వాములతో ఐటిఐ గ్రాడ్యుయేట్ల ఉపాధిని పెంచడానికి నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ జి.ముకుంద రెడ్డి అన్నారు. గురువారం గేట్‌వే జిల్లా సమావేశం ముకుంద రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ జి.సునీత, కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ జాసన్, వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్ గౌడ్, వైదేహి, ప్రభావతి, ఐటిఐ ప్రిన్సిపల్స్ శ్రీనివాస్ రావు, శైలజ, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముకుంద రెడ్డి మాట్లాడుతూ టి గేట్ కమిటీల ద్వారా నాణ్యమైన సాంకేతిక విద్యను ఐటిఐ , ఏటిసి విద్యార్థులకు అందించి వారిని నైపుణ్యం గల విద్యార్థులుగా తీర్చిదిద్ది వారికీ తగిన ఉపాధి కల్పించడానికి కమిటీ సహకరిస్తుందన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో ఉన్న ఐటిఐలలో ఫర్ యాప్టింగ్ అండ్ ట్రైనింగ్ ఎంప్లాయ్‌మెంట్ (టిగేట్). ప్రస్తుతం, రాష్ట్రంలో ఐటిఐ గ్రాడ్యుయేట్లలో పూర్తిగా సీట్లు నిండే విధంగా కమిటీ పనిచేస్తుందన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాల ద్వారా కొత్త కోర్సులు ప్రారంభించి అర్హులైన వారికీ సీట్ల భర్తీకి కమిటీ పనిచేస్తున్నదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకట స్వామి, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ల ఆధ్వర్యంలో ఈ కమిటీలు నూతనోత్సాహంతో పని చేస్తున్నాయని అన్నారు. ఐటిఐలలో వంద శతం ప్లేసెమెంట్ లక్ష్యంతో కమిటీలు పనిచేస్తాయని, హైదరాబాద్ జిలాల్లో మొత్తం 8 ఐటిఐలు ఉన్నాయని, ఇందుకు ఐదు టి గేట్ కమిటిలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ లతో కమిటీ ఏర్పాటు చేశామని అన్నారు.

### టిఆర్టీ బస్తీ దవాఖానాను తనిఖీ చేసిన కార్పొరేటర్



బస్తీదవాఖానను పరిశీలిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, జూలై 24 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లో టిఆర్టీలో ఉన్న బస్తీ దవాఖానాను స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ గురువారం తనిఖీ చేసి పరిస్థితిని సమీక్షించారు. బస్తీ దవాఖానాలో ఉన్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. బస్తీ దవాఖానాకు వచ్చే రోగులకు అందుతున్న సేవల వివరాలను ఆరాతీశారు. అనారోగ్యం తో వచ్చే వారికి అందచేసే మందులకు కొరత లేకుండా చూడాలని, వర్షా కాలం దృష్ట్యా ప్రబలే సీజనల్ వ్యాధుల నివారణకై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.రోగ నిర్ధారణ కొరకు చేసే పరీక్షలు వాటి రిపోర్ట్ లను ఎప్పటికప్పుడు అందేలా చర్యలు తీసుకోవాలని, వాటితో పాటు వైద్యులకు, నర్సులకు, ఆశా వర్కర్లకు కల్పించే సదుపాయల్లో లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టి కి తేవాలని, అవసరమున్న సదుపాయాలు,సౌకర్యాలు సమకూర్చేందుకు నిత్యం ముందుంటానని వివరించారు. సమావేశంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, వైద్యులు డాక్టర్ అవంతి, డాక్టర్ ప్రవళిక, నర్సు కృపా, ఆశ వర్కర్ దుర్గా పాల్గొన్నారు.

### బోర్డు సభ్యులు లేకుండా సమీక్షా సమావేశం ఎలా నిర్వహిస్తారు

**మంత్రిని ప్రశ్నించిన బోర్డు సభ్యుడు ఎం.డి.యూసఫ్**

**సైఫాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** కనీస వేతనాల గురించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో సమీక్షా సమావేశం బోర్డు సభ్యులతో నిర్వహించారని తమకు తెలిసిందని, కాని కనీస వేతనాల సలహా మండలి సభ్యుడైన తనకు ఈ విషయంలో ఏలాంటి సమాచారం లేదని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ చెప్పారు. బోర్డు సభ్యులకు సమాచారం లేకుండానే బోర్డు సభ్యులు పాల్గొన్నారంటూ సోషల్ మీడియలో వచ్చిందని, బోర్డు సభ్యులు లేకుండానే సమీక్షా నిర్వహించడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కనీస వేతనాల బోర్డు సలహా మేరకు కనీస వేతనాలను నిర్ణయించాలని, సమీక్షలతో ఏమాత్రం వేతనాలు తగ్గించినా కార్మిక వర్గం ఉద్యమాలకు సిద్ధం అవుతుందని ఆయన హెచ్చరించారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని మొత్తం బోర్డు సభ్యులతో చర్చించి కనీస వేతనాల జివోలను వెంటనే విడుదల చేసి రాష్ట్రంలో ఉన్న ఒక కోటి 20 లక్షల మంది కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో కార్మికులకు ఏలాంటి అన్యాయం జరిగినా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

### ప్రభుత్వం హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ అమలు చేయాలి

**సైఫాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ యూత్‌కు ఇచ్చిన డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ యువజన సంఘం డిమాండ్ చేసింది. లేని పక్షంలో విద్యార్థి, యువజనులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు హెచ్చరించారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నదని, హామీలను అమలు చేస్తామని చెప్పి అటకెకించిందని ఆరోపించారు. హామీలను అమలు చేయాలని కోరితే అక్రమంగా అరెస్టులు కొనసాగిస్తున్నదని, రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఏడాది లోపు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని, జాబ్ క్యాలెండర్‌పేరుతో అడఫా, దడఫా చిన్న నోటిఫికేషన్‌లు విడుదల చేసి చేతులు దులుపుకుంటున్నదని ఆరోపించారు. నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని, స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### ట్రాఫిక్ పోలీసు సైనేజ్ బోర్డులపై వ్యాపార ప్రకటనలు




ట్రాఫిక్ సైన్ బోర్డుపై పోస్టర్‌ను అంటించిన దృశ్యం

**పేట్ బషీరాబాద్, జూలై 24, ప్రభాతవార్త** ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని రహదారులపై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సైన్ బోర్డులపై సేవ్ ఓక్స్ పెట్ హాస్పిటల్, కొంపల్లి వారు తమ ప్రకటనలను, పోస్టర్లను అతికించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఏ.నాగరాజు తెలిపారు. ట్రాఫిక్ సైన్ బోర్డులు ప్రజలకు రహదారి సమాచారం, హెచ్చరికలు అందించేందుకు మాత్రమే ఏర్పాటు చేయబడతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సైన్ బోర్డులపై తమ వ్యాపార ప్రకటనలు ఏర్పాటు చేసిన అట్టి యాజమాన్యంపై పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. వాహనదారులకు సూచనలు ఇచ్చే సైన్ బోర్డులపై ఎలాంటి ప్రకటనలు గానీ లేదా అడ్డంకులు గానీ కలిగించరాదని తెలిపారు. ఒకవేళ అలాంటి చర్యలు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు కూడా ఇలాంటి ప్రకటనలు గమనిస్తే తమకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ నాగరాజు విజ్ఞప్తి చేశారు.

### 50శాతం బొగ్గు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలి

**-సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య, సారంగపాణి తదితరులు

**హైదరాబాద్, జూలై 24,ప్రభాతవార్త:** కోల్ ఇండియా, సింగరేణి, నైవేలి బొగ్గు కంపెనీలను కాపాడాలని, రెగ్యులర్ ఉద్యోగుల ద్వారా కనీసం 50 శాతం బొగ్గు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి కాంటాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికులకు హెచ్‌పిసి జీతాలు ఇవ్వాలని, ఉచిత వైద్య సేవలు అందించాలని కోరారు. అన్ని బొగ్గు కంపెనీల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని,పిఎఫ్ వ్యవస్థను పూర్తిగా ఆన్లైన్ చేసి పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే యాజమాన్యం పక్షపాత ధోరణిని విడనాడాలని, కంపెనీ పరిపాలనను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికీ చెల్లించవలసిన రూ.39,600 కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలని లేదంటే జూలై 23 నుండి సెప్టెంబర్ 17 వరకు ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈసమావేశంలో ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి.మాధవ నాయక్ , కార్యనిర్వాహక అధ్యక్షులు,శ్రీనివాస్, స్టాండరైజేషన్ కమిటీ సభ్యులు టి.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడ్డ ఎండు గంజాయి, ఆల్ఫాజోలం

**పేట్ బషీరాబాద్, జూలై 24, ప్రభాతవార్త** మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ విభాగం గురువారం వేరువేరు ప్రాంతాలలో జరిపిన దాడుల్లో 12.500 కేజీల ఎండు గంజాయి, 140 గ్రాముల ఆల్ఫాజోలం, ఒక స్విఫ్ట్ కారు బైక్ను స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ తెలిపారు. మహారాష్ట్రలోని పర్లీ వైద్యనాథ్ ప్రాంతానికి చెందిన మాజ్లుమ్ ఖురేషి (39), అబ్దుల్ రెహమాన్ భగవాన్ (19) అనే ఇద్దరు నిందితులు బైక్ పై 10 కేజీల గంజాయిని హైదరాబాదులోనే కూకట్పల్లికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరికి గంజాయిని సరఫరా చేసిన పర్లికి చెందిన వసీం పై కూడా కేసు నమోదు చేశారు. మరొక కేసులో మేడ్చల్ చెక్ పోస్ట్ వద్ద రూట్ వాచ్ చేసి బాలానగర్‌లోనే ఫిరోజ్‌గూడకు చెందిన రాగుల సాయికుమార్ (26) తన సొంత కారులో 2.500 కిలోల గంజాయిని తరలిస్తుండగా అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కూకట్పల్లి మెట్రో స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన రంగారెడ్డి జిల్లా ముస్లాపూర్ గ్రామానికి చెందిన జి బాలరాజ్ (65) వద్ద 140 గ్రాముల ఆల్ఫాజోలంను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో తాము స్వాధీనం చేసుకున్న గంజాయి, ఆల్ఫాజోలం, కారు బైకు, 5 ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ సుమారు 7 లక్షల 20 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ దాడులను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండింటెంట్ మాధవయ్య పర్యవేక్షణలో సిఐ నర్సిరెడ్డి, ఎస్సై పవన్ కుమార్ రెడ్డి, సిబ్బంది సత్తార్, సంజయ్, మున్నాఫ్, వెంకటేశ్వర రావు, శ్రీనివాస్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### 28, 29 తేదీలలో ఎల్ఐసి ఉద్యోగులకు వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు

**ముషీరాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** ఎల్ఐసి ఉద్యోగులకు విధి నిర్వహణతోపాటు శారీరక మానసిక ప్రశాంత కోసం ఈ నెల 28, 29 తేదీలలో సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సి గ్రౌండ్ లో వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో జోనల్ స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని ఎల్ఐసి ఆఫ్ ఇండియా సికింద్రాబాద్ సీనియర్ మేనేజర్ జి.మధుసూధన్ తెలిపారు. ఎల్ఐసి ఆఫ్ ఇండియా సౌత్ సెంట్రల్ జోనల్‌స్థాయిలో జరిగే ఈ పోటీలలో విజేతలైన వారు జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. దోమలగూడలోని ఎల్ఐసి సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఎల్ఐసిలో పనిచేస్తున్న ఉద్యోగులకు క్రీడా పోటీల ను నిర్వహించి వారిలో ఉత్సహాన్ని నింపడానికి చర్యలు తీసు కుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 28, 29తేదీలలో జరిగే పోటీలలో తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 85 మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

### చంటి పాపతో ప్రీమియర్ షోకు వెళ్లిన తల్లి.. వెనక్కి పంపిన పోలీసులు

**చిక్కడపల్లి, జూలై 24 ప్రభాతవార్త:** పవన్ కల్యాణ్ తాజా చిత్రం హరిహర వీరమల్లు విడుదలకు ముందు ప్రీమియర్ షోలు వేసిన సంగతి తెలిసిందే. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో ఉన్న సంధ్య థియేటర్ లో నిన్న రాత్రి ప్రీమియర్ షో వేశారు. ఈ షో చూసేందుకు ఓ మహిళ తన చంటిబిడ్డతో కలిసి వచ్చింది. దీంతో థియేటర్ నిర్వాహకులు ఆమెను లోపలికి అనుమతించలేదు. బిడ్డతో పాటు ఆమెను వెనక్కి పంపించారు. గతంలో పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా ఇదే సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. తొక్కిసలాటలో ఓ మహిళ ప్రాణం కోల్పోగా ఆమె కొడుకు కోమాలోకి వెళ్లాడు. సుదీర్ఘ చికిత్స తర్వాత ఇటీవలే ఆ బాలుడు డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదని సమాచారం. ఈ నేపథ్యంలో హరిహర వీరమల్లు ప్రీమియర్ షోకు పసిబిడ్డతో వచ్చిన తల్లిని పోలీసులు వెనక్కి పంపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ వీడియోను చూసిన నెటిజన్లు ఆ మహిళపై తీవ్రంగా మండిపడుతున్నారు. చిన్న పిల్లను తీసుకుని బెనిఫిట్ షోకు రావడం ఏంటని విమర్శిస్తున్నారు.

## జనరల్ మేనేజర్‌ను కలిసిన ఎమ్మెల్యే మర్రి



**మల్కాజిగిరి జూలై24,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వెస్ట్ మారేడుపల్లి జలమండలి జనరల్ మేనేజర్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ వినోద్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి గౌతమ్ నగర్ డివిజన్లోని ఐ.ఎన్. నగర్ ప్రాంత వాసులకు త్రాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు.జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ జెపిసి వెంకన్న హేమంత్ పటేల్, సర్వే నరేష్, గద్వాల వంశీ ముదిరాజ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాప్ లింగ్ క్రీడలకు చక్కటి ఆదరణ : కోచ్ కృష్ణ



విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న కోచ్ ఆదిమూల కృష్ణ తదితరులు

**మలక్ పేట,జూలై 24, ప్రభాతవార్త:** గ్రాప్ లింగ్ క్రీడలకు చక్కటి ఆదరణ లభిస్తుందని రా కంబాట్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ ఆదిమూల కృష్ణ పేర్కొన్నారు. నగరంలో జరిగిన తెలంగాణ ఓపెన్ గ్రాప్ లింగ్ పోటీలలో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్ ఆదిమూల కృష్ణ ఘనంగా సన్మానించి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాప్ లింగ్ క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ లో గ్రాప్ లింగ్ క్రీడలను నూతనంగా ప్రవేశపెట్టారని, గ్రాప్ లింగ్ క్రీడలు ఒక రకమైన కుస్తీ పోటీ మాదిరిగా ఉంటుందని వివరించారు. విగ్నేష్, వినయ్, విశాల్, తరుణ్, పవన్, సింగ్ లు బంగారు పతకాలు, ఈశ్వర్, రుద్రాన్ష్, ప్రణవ్, అంకిత్, జయంత్, అభినాష్ లు రజత పతకాలు ,అజయ్, విగ్నేష్ లు కాంస్య పతకాలు సాధించారని వివరించారు.

## మంత్రి శ్రీధర్ బాబుతో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి భేటి



**మల్కాజిగిరి జూలై24,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఐ.టి.శాఖ మరియు శాసన సభ వ్యవహారాల శాఖ, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు శ్రీధర్ బాబుని మర్యాదపూర్వకంగా కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని, అల్వాల్ లో సబ్ రిజిస్టర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని, సర్వే నెంబరు 844లో హైదరాబాద్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాల భౌగోళిక సరిహద్దులు నిర్ణయించేందుకు ఏ.డి. సర్వే చేయించాలని, అల్వాల్ జొన్న బండ ప్రాంతంలో సర్వే నెంబర్లు 22 23, మరియు 582, 583 భూమి కబ్జా, భూ ఆక్రమణాల నుండి కాపాడాలని మంత్రివర్యులకు విన్నవించగా సానుకూలంగా స్పందించి వెంటనే మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జేపీసీ వెంకన్న మేకల రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్



మ్యాన్ హోల్స్‌లో చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ ప్రెస్ కాలనీలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ వర్షం పడినప్పుడు వరదనీరు రోడ్లపై నిలబడడం వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని, క్యాచ్ పిట్లు, మ్యాన్ హోల్స్‌లోని చెత్తను వెంటనే తీసివేసి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, హెచ్ఎండబ్ల్యుఎస్ మేనేజర్ అల్తాఫ్ పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా చంపాపేటలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కమిటి చైర్మన్ భగవాన్

**సైదాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పదని శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటి చైర్మన్ దండేటికార్ భగవత్ జీ(భగవాన్) అన్నారు. అమావాస్య సందర్భంగా గురువారం శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటి ఆధ్వర్యంలో చంపాపేటలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటి చైర్మన్ భగవాన్ మాట్లాడుతూ గత 27 మాసాలుగా ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్ బిఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, కమిటి సభ్యులు సుశీల్ కుమార్, సంతోష్ లడ్డ, చింటు, ఆడెళ్ల రాజు, టింగ్లికార్ రాజేష్, తిలక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ శ్వేత ఫిర్యాదుపై జాయింట్ కమిషనర్ విచారణ

**సైదాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు విడుదల చేయడంలో అధికారులు పక్షపాతం వహిస్తున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపై జాయింట్ కమీషనర్ విచారణ చేపట్టారు. వచ్చే నెల 6వ తేది లోగా కార్పొరేటర్ శ్వేత అడిగిన సమాచారాన్ని అందించాలని అధికారులకు జాయింట్ కమీషనర్ సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ ఐఎస్ సదన్ డివిజన్‌లో 51,268 మంది ఓటర్లు ఉన్నారని, ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నిక కాబడిన ప్రజా ప్రతినిధిగా డివిజన్ అభివృద్ధి కోసం పోరాడటం తన బాధ్యత అని అన్నారు. డివిజన్ అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా వారు వివక్ష ప్రదర్శిస్తున్నారని కార్పొరేటర్ శ్వేత ఆరోపించారు.

## అరుదైన హైరిస్క్ హార్ట్ సర్జరీ విజయవంతం : డాక్టర్ సుధీర్‌మలక్



శాస్త్ర చికిత్సను నిర్వహిస్తున్న కేర్ ఆసుపత్రి వైద్య బృందం

**మలక్‌పేట,జూలై 24, ప్రభాతవార్త:** మలక్ పేట కేర్ హాస్పిటల్‌లో అరుదైన హై రిస్క్ హార్ట్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. కేవలం 30 కిలోల బరువు ఉన్న 29 సంవత్సరాలు వయస్సు గల మహిళకు మలక్ పేట కేర్ ఆసుపత్రిలో అత్యంత క్లిష్టమైన మిట్రల్ వాల్వ్ మార్పిడి శస్త్ర చికిత్సను వైద్య బృందం విజయవంతంగా నిర్వహించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మూర్ఛలు, హైపోథైరాయిడిజం వంటి సమస్యలతో బాధపడుతున్న మహిళకు గుండె మిట్రల్ వాల్వ్ పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిసింది. తక్కువ బరువు, అనుబంధ సమస్యలతో శస్త్ర చికిత్స ప్రమాదకరంగా మారింది. దీంతో మలక్ పేట్ కేర్ ఆసుపత్రి సీనియర్ కార్డియోథోరాసిక్, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ సుధీర్ గండ్రకోట నేతృత్వంలో కార్డియాక్ వైద్య బృందం అత్యంత జాగ్రత్తగా సర్జరీ నిర్వహించడం కోసం ప్రణాళిక రూపొందించి బహుళ శాఖల సమన్వయంతో శాస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ గండ్రకోట, కేర్ ఆస్పత్రి సిఓఓ ప్రవీణ్ లు మాట్లాడుతూ ఇది అత్యంత క్లిష్టమైన కేసు అని, బరువు తక్కువగా ఉండటం, ఇతర ఆరోగ్య సమస్యలు ఉండడంవల్ల శాస్త్ర చికిత్స ప్రమాదకరంగా మారిందని, అయినప్పటికీ మా వైద్య బృందం అద్భుతంగా పనిచేసిందని వివరించారు. శాస్త్ర చికిత్స పూర్తి అయిన వెంటనే నాలుగు రోజులకే రోగిని ఆరోగ్యంగా డిశ్చార్జ్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇటువంటి విజయం మా వైద్య సేవల నాణ్యతకు నిదర్శనమన్నారు. అత్యాధునిక వైద్యం, సమన్విత ప్రయత్నాలతో రోగికి భద్రతతో కూడిన అత్యుత్తమమైన వైద్య చికిత్సలను అందించగలమని ఈ విజయం నిరూపించిందని తెలిపారు. ఈ చికిత్స తెలంగాణ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అందించడం జరిగిందని వివరించారు. తమ కేర్ ఆస్పత్రులలో చికిత్స తీసుకోవడం వల్ల పేద కుటుంబాలకు కూడా ఆశాజనకమైన అత్యుత్తమ ఫలితాలు లభిస్తున్నాయని తెలిపారు.

## క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలి

### -మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి



క్రీడల్లో విజయం సాధించిన విజేతలకు పథకాలు అందిస్తున్న కమిషనర్ భాస్కర్ రెడ్డి

**కుషాయిగూడ, జూలై 24, ప్రభాతవార్త :** క్రీడల పట్ల కలిగించేలా కోచులు చేస్తున్న కృషి అభినందనీయమని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. రెండవ జాతీయ శాంక్షన్ ఛాంపియన్షిప్ పోటీలు ఢిల్లీలో నిర్వహించారు. తెలంగాణకు సంబంధించిన 6 అథ్లెట్ లో పాల్గొనడం జరిగింది ఇందులో ఎం. సర్వేష్ 400 ఏం,బంగారు,, 200 మీటర్స్, వెండి, మెడల్ అండర్ 16, సిహెచ్. గణేష్ 100 బంగారు, 200 మీటర్స్, రజతం మెడల్ అండర్ 16, జి. అభినయశ్రీ 200 మీటర్స్, బంగారం, 100 మీటర్స్, బంగారు,మెడల్ అండర్ 14 బి.సాత్విక్ 1500 మీటర్స్, మెడల్ అండర్20 , వి శ్రీహన్ 60 మీటర్స్ రజతం,మెడల్ అండర్10 బి. దేవేందర్ 400 మీటర్స్, తామ్రము మెడల్ అండర్14 సాధించారు. ఈ ఛాంపియన్షిప్ 15 జూలై 20 25 మంగళవారం న్యూఢిల్లీలో జరగగా మేడ్చల్ కలెక్టర్ ఆఫీసులో డిస్ట్రిక్ట్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్ రావు ఈరోజు వీరికి కోచ్ , మేనేజర్ బురాడి తిరుమల రావునీ అభినందించడం జరిగింది. ఈ ఛాంపియన్షిప్ లో పార్టిసిపేట్ చేయడానికి ప్రోత్సహించిన నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, భాస్కర్ చౌదరి , మాట్లాడుతూ రాష్ట్రానికి దేశానికి మరింత పేరు తీసుకురావాలని అభినందిస్తూ పిల్లలు జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం గర్వకారణం అని తల్లిదండ్రుల సంతోషం అథ్లెట్ కోచ్ తిరుమల ను అభినందించారు.

## స్ట్రీట్ విండర్ సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు



జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, జూలై 24 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్లోని ఆనందనగర్ చౌరస్తా మత్తుగూడ కాలనీ రోడ్డులో స్ట్రీట్ విండర్స్ తమ చిరు వ్యాపారం నడుపుతుంటే జిహెచ్ఎంసి అధికారులు, రాజీవ్‌స్వగృహ నివాసితులు స్ట్రీట్ వెండర్స్ పనులను ధ్వంసం చేయడం అమానుషమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, జిల్లా సహాయకార్యదర్శి ఎం.వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎల్బీనగర్ జోనల్‌కమిషనర్, సరూర్‌నగర్ డిప్యూటీకమిషనర్ దృష్టికి తీసుకువెళ్తూ కార్మికులతో కలిసి ఆయా కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాజీవ్ గృహకల్ప ఆక్రమించిన నాలుగు గజాల భూమిని జిహెచ్ఎంసి రోడ్‌కి వదిలివేయాలని, గతంలో జాతీయ జెండా ఎగరవేసిన స్థలంలో కూల్చివేసిన దిమ్మెను కట్టించాలని డిమాండ్ చేశారు.జిహెచ్ఎంసి నుండి చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ ఆర్థిక సహకారం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎరుపుల యాదయ్య, కొత్త సైదులు, ఖమ్మంశెట్టి సురేష్‌రావు, బుట్టా కృష్ణ, ఎం.లావణ్య, కె.అనిత, కే.సుజాత తదితరులు పాల్గొన్నారు.

## చెత్తను రోడ్లపై వేయడమంటే అనారోగ్యాన్ని కోరి తెచ్చుకోవడమే : కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



పారిశుధ్యంపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 24 ప్రభాతవార్త:** చెత్తను రోడ్లపై వేయడం అంటే అనారోగ్యాలను కోరి తెచ్చుకోవడమే అని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బినగర్ డిసి మల్లికార్జున్‌తో కలసి గురువారం డివిజన్ పరిధిలోని వడ్డెరబస్తీలో పర్యటించి 'పారిశుధ్యం'పై స్థానికులకు ముఖ్యంగా చెత్తను ఆటోలో వేయమని వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేయడం వల్ల అనారోగ్యాల బారిన పడాల్సి వస్తుందని, అప్పుడు ఆసుపత్రులకు లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. చెత్తను రోడ్లపై వేసే వారి వల్ల వారి ఆరోగ్యంతో పాటు ఇతరుల ఆరోగ్యాలు కూడా పాడవుతాయని అన్నారు. రోడ్లపై చెత్త వేస్తే ఖచ్చితంగా ఫైన్ విధిస్తామని, అవసరమైతే కరెంట్ చేస్తామని ఆయన హెచ్చరించారు. కాలనీ అసోసియేషన్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ నగేష్ నాయక్, నాయకులు శ్రీధర్‌గౌడ్, శ్రవణ్ గుప్తా, ప్రవీణ్‌రెడ్డి, జూపల్లి ప్రవీణ్, అనసూయ, కాలనీవాసులు ప్రభాకర్, వెంకట్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై సమగ్ర సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**తుర్కయంజాల్ జూలై 24,ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడ బిఎమ్ఆర్ సార్థ కన్వెన్షనల్ లో నియోజకవర్గం స్థాయిలో ఇందిరమ్మ ఇండ్లు మరియు రేషన్ కార్డులు పై సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ నాలుగు మున్సిపాలిటీ పరిధిలో అరులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మరియు రేషన్ కార్డులు, పింఛన్లు అందించాలని, సంబంధిత ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సంబంధిత మున్సిపల్ అధికారులు,మండల అధికారులకు తెలియడం ప్రతి ఒక్క గ్రామానికి ప్రతి ఒక్క మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలకు రేషన్ కార్డులు అందించాలని, మరియు ఇందిరమ్మ ఇండ్లు ప్రతి ఒక్కరికి అందించాలని వారు అధికారులకు తెలియజేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఇల్లు లేని వారికి అందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేసింది కాబట్టి ప్రజల సొంత ఇంటి కల కూడా నెరవేరుస్తుందని వారు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు, మరియు పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, ఎంతమందికి ఇప్పటికీ నియోజవర్గంలో ఎన్ని వచ్చినవి ఇంకా ఎన్ని రావాలి అధికారులు ఇంటింటికి పోయి ప్రజలను తెలుసుకోవాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్, డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య ఆర్డీవో, ఎమ్మార్వో, మున్సిపాలిటీ అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## అల్మాస్‌గూడలో ఘనంగా గురువారం బోనాలు



మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ రామిడి కవితల ఆధ్వర్యంలో గ్రామ దేవతకు బోనం తీసుకువెళ్తున్న కుటుంబ సభ్యులు

**సరూర్‌నగర్, జూలై 24 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో గురువారం బోనాల పండుగ ఘనంగా జరిగింది. ప్రతి సంవత్సరం హైదరాబాద్ పాతబస్తీ మహంకాళి బోనాల జాతర జరిగిన ఆదివారం తర్వాత వచ్చే గురువారం రోజు ఇక్కడి గ్రామ ప్రజలు బోనాలను జరుపుకోవడం చాలా సంవత్సరాల నుండి ఆచారంగా వస్తున్నది. ఈ క్రమంలో పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుండి ఎడ తెరిపి లేకుండా వర్షపు జల్లులు కురుస్తున్నా మహిళలు బోనాలతో స్థానిక అమ్మవారి దేవాలయాలకు తరలివెళ్ళి శాక సమర్పించారు. అల్మాస్‌గూడ గ్రామ మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ రామిడి కవితా రాంరెడ్డి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి పూజలు చేసి బోనం సమర్పించారు. పండుగ సందర్భంగా అమ్మవారి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ చైర్మన్ చప్పిడి సంతోష్‌రెడ్డి, సభ్యుడు జంగారెడ్డిలతో పాటు పలువురు బోనాలు తీసుకువస్తున్న మహిళలకు వర్షం వల్ల ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయంలో కార్పెట్లు ఏర్పాటు చేయించారు.

## స్వల్ప విషయంలో వివాదం..నిందితుల అరెస్టు

**మలక్ పేట, జూలై 24, ప్రభాతవార్త:** గడ్డి అన్నారం బస్తీలో అర్ధరాత్రి స్వల్ప విషయంలో వివాదం తలెత్తి పలువురిని తీవ్రంగా గాయపరిచిన నిందితులను మలక్ పేట పోలీసులు అరెస్టు చేశారు . ఇన్స్ పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపిన వివరాలు.. గడ్డి అన్నారం బస్తీలో సోమవారం అర్ధరాత్రి బస్తీ దావఖానా ఎదురుగా ఉన్న వీధిలో హరి శంకర్ , అభిలాష్, విశ్వేశ్వర్, అరవింద్ అనే వ్యక్తులు మాట్లాడుకొనుచుండగా.. అదే ప్రాంతానికి చెందిన సాయి, మరో ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్ పై వెళ్తుండగా నెమ్మదిగా వెళ్లాలని వారు సూచించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వారు అక్కడ నుంచి వెళ్లిపోయా రు. కొంతసేపటి తరువాత నరేష్ అలియాస్ నాచ, బాబు, వంశీ , సురేష్, అనే యువకులు అక్కడికి చేరుకుని కర్రలు, రాడ్ల తో వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వారించబోయిన బస్తీ వాసులను కూడా గాయపరిచారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నలుగురు నిందితులను బుధవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకొని గురువారం జరిగిన బిజెపి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, జులై 24 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఆర్కేపురం డివిజన్‌లోని ఉర్దూ మీడియం స్కూల్ విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు, పెన్సిల్‌లు డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అరవింద్‌శర్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా పాల్గొనాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు విద్యార్థులు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొడుగు శ్రీనివాస్, సాజీద్, శ్రీనివాస్ రెడ్డి, రామాచారి, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, ముచింతల జగన్, రమేష్, సంతోష్, శివనాయక్, నవీన్‌గౌడ్, నిరంజన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు



కార్యక్రమంలో పాల్గొన్న బుగ్గారపు వరుణ్‌గుప్తా

**ఎల్.బి.నగర్, జులై 24 ప్రభాతవార్త:** అమ్మవారి బోనాల అనంతరం పలహారం బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుగ్గారపు వరుణ్ గుప్తా పాల్గొనే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, దీపక్, హనుమాన్ దేవాలయం డైరెక్టర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ డివిజన్‌లో మొక్కలు నాటిన ఎమ్మెల్యే బిఎల్ఆర్ ,కార్పొరేటర్ పన్నా



అంబేద్కర్ భవన్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్ చిత్రంలో కార్పొరేటర్ పన్నాల

**నాచారం, జులై 24 ప్రభాతవార్త :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని డా. బిఆర్‌అంబెద్కర్ భవన్‌లో కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని కార్పోరేటర్ పన్నాల ఇతర బిఆర్ఎస్ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఇంటికో మొక్క నాటాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసిన బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు



కేంద్ర మంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న అధ్యక్షుడు రామచందర్‌రావు

**తార్నాక, జులై 24 ప్రభాతవార్త :** తెలంగాణ బిజెపి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్. రాంచందర్ రావు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఢిల్లీలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బిజెపి సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు, గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత ఉత్సాహంగా కొనసాగించి తెలంగాణ అంతటా బిజెపిని విస్తరిం చేందుకు తన దృఢ నిబద్ధతతో ముందుకు తీసుకెళ్తానని రాంచందర్ రావు ఈ సందర్భంగా అమిత్ షాకు వివరించారు.

## విద్యార్థులు నోటు పుస్తకాలు, డిక్షనరీల పంపిణీ



నోటు పుస్తకాలు, డిక్షనరీలు పంపిణీ చేస్తున్న అర్కల కామేష్‌రెడ్డి

**సరూర్‌నగర్, జులై 24 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ జూనియర్ కళాశాలలో గురువారం కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిక్షనరీలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. పార్టీకి చెందిన పలువురు నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, కార్పొరేషన్ బిజెపి ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్ నాయక్, మహిళాధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీతా బాల్‌రాజ్, మాజీ ఎంపిటిసి పాలపర్తి విజయలక్ష్మి, సీనియర్ నాయకులు సిద్దాల బీరప్ప, దీప్‌లాల్ చౌహాన్, సుదర్శన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చింతపట్ల జ్ఞానేశ్వర్‌చారి, దయానంద్ ముదిరాజ్, శేఖర్‌గౌడ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గడ్డమీది లక్ష్మణ్ ముదిరాజ్, అబ్బనమోని గోపి యాదవ్, పంతంగి మాధవి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ యూనిట్ నూతన అధ్యక్షుడిగా పూన్ రెడ్డి కృష్ణారెడ్డి



పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ యూనిట్ అధ్యక్షుడు పూన్ రెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు భరత్ రెడ్డి తదితరులు

**మలక్ పేట ,జూలై 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ యూనిట్ నూతన అధ్యక్షుడిగా పూన్ రెడ్డి కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. మలక్ పేట్ సలీం నగర్ లోని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో హైదరాబాద్ యూనిట్ నూతన అధ్యక్షుడిగా పూన్ రెడ్డి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా కృష్ణ హరి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సుధాకర్, ఉపాధ్యక్షులుగా కే. మోహన్, కృష్ణ, లలిత సరోజమ్మ, సుభాష్ గౌడ్, యాదగిరి, సరోజిని, రామాచారి, చంద్రశేఖర్, దయానంద్, సుదర్శన్, నరసింహులు ఎన్నికయ్యారు. హైదరాబాద్ యూనిట్ అధ్యక్షుడిగా ఎన్నికైన పున్ రెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లకు ఎల్లవేళల అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన హైదరాబాద్ యూనిట్ కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు భరత్ రెడ్డి, సెక్రటరీ జనరల్ చోళా ఓం ప్రకాష్ తదితరులు అభినందించారు.

## మీర్‌పేట్ బిజెపి ప్రధాన కార్యదర్శిగా కసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి



రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్‌తో కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 24 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి ప్రధాన కార్యదర్శిగా కసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నియామకానికి సంబంధించిన ధృవపత్రాన్ని ఆయన రంగారెడ్డి జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ బిజెపి ప్రధాన కార్యదర్శిగా తన నియా మకానికి సహకరించిన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి, కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్పొరేషన్‌లో బిజెపి పటిష్టతకు కృషి చేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రచారం చేస్తానని స్పష్టం చేశారు.